
# లిఫ్ట్

- పడాల రాధాకృష్ణ



**'అ**య్యగారూ!'

ఆఫీసుకు టైం అవుతోందని హడావుడిగా వెళ్తోన్న ధనుంజయ ఆ పిలుపు విని స్కూటర్ స్లో చేశాడు.

ఆ గొంతు ఎక్కడో విన్నట్లు అనిపిస్తోంది. అంతమంది జనంలో ఎవరూ కనబడలేదు. ఒక్క క్షణం ఆగి తనని కాదనుకుని మరలా స్కూటర్ రైజ్ చేయబోయాడు.

"అయ్యగారూ!... అయ్యగారూ!..." ఆ గొంతు మరింత బిగ్గరగా వినబడింది. ఈ సారి ఎదురుగా ఆ కుర్రాడు.

అతను ఎవరో తనకు తెలియదు... కానీ ఎక్కడో చూసిన గుర్తు.

"సార్! నేను గుర్తులేదా? మొన్న ఓంకారక్షేత్రం దగ్గర నన్ను పలకరించి మెచ్చుకున్నారు" గుర్తున్నట్లు తలూపి

"ఏమిటీ ఇక్కడున్నావు?" అడిగాడు.

"సెంటర్‌కి వెళ్ళాలి సార్! డ్యూటీకి టైమ్ అయిపోతోంది. లేట్ అయితే మా ఓనర్ ఊరుకోడు. ఏమీ అనుకోక నన్నక్కడ డ్రాప్ చేస్తారని"... ఒక్క సారి అతణ్ణి పై నుండి కింది వరకూ పరికించి చూసిన ధనుంజయ ముఖంలో అసహనం తొణికిసలాడింది. మాసిన బట్టలు, చెదిరిన జుట్టు, తెగడానికి సిద్ధంగా వున్న చెప్పులు ధరించిన ఆ కుర్రాడు చూడ్డానికి చాలా చికాకు గొలిపేలా ఉన్నాడు.

"ప్లీజ్ సార్! తొమ్మిది గంటలకల్లా షెడ్‌లో వుండకపోతే మా ఓనర్ ఊరుకోడు సార్!"

ఏమనుకున్నాడో ధనుంజయ స్కూటర్ వెనకాల సీట్‌లో కూర్చోమని సైగచేసి స్టార్ట్ చేశాడు.

"అయ్యగారూ! మీరు శ్రీరామ్ చిట్‌ఫండ్స్ ఆఫీసులో పనిచేస్తారనుకుంటా?"

"నీకెలా తెలుసు?" ఒకింత ఆశ్చర్యకరంగా అడిగాడు.

"నేను పనిచేస్తున్న మోటారు సర్వీసింగ్ స్టేషన్ కూడా మీ ఆఫీసు పక్కనే ఉందండి. అక్కడ రోజూ మిమ్మల్ని చూస్తూ వుంటాను. మీ పేరు ధనుంజయ కదూ సార్!"

"నా గురించి మొత్తం ఇన్ఫర్మేషన్ అంతా గేదర్ చేశావ్. మొత్తానికి బాగా తెలివైనవాడివే. ఇంతకీ నీ పేరేంటి?"

"జయరాం ... సార్!"

"అక్కడ ఏమి చేస్తుంటావ్?"

"షెడ్‌లో క్లీనర్‌గా పనిచేస్తుంటాను సార్!"

"ఎంతవరకు చదివావ్?"

"ఐదు పాసయ్యానండీ. తరువాత కుదరలేదు".

"అదేంటి పట్టుమని నీకు పది సంవత్సరాలు ఉన్నాయో లేదో... చదువు మానేసానంటా వేమిటి?"

"రోజూ బడికి వెళితే మరి ఈ క్లీనింగ్ పనులు ఎవడు చేస్తాడు సార్!"

"అద్సరే మీ అమ్మానాన్నలు ఏం చేస్తుంటారు?"

"మా అమ్మ నా చిన్నతనంలోనే చచ్చిపోయింది. అయ్య ఏవో చిన్నచిన్న పనులు చేస్తుంటాడు".

ధనుంజయకి పేదవారంటే పెద్దగా గిట్టదు. వాళ్ళు మొరటుగా వుంటారని, సున్నితంగా ఉండరని, తరచూ దౌర్జన్యాలకు పాల్పడుతుంటారని, వారి ఆలోచనలు, భావాలు అధమంగా వుంటాయని, ఉన్నతంగా ఆలోచించరని అతని ఉద్దేశ్యం. ఎప్పుడూ ఏదో హక్కుల గురించి మాట్లాడతారని, సంకుచిత ధోరణితో ప్రవర్తిస్తారని అనుకుంటూ ఉంటాడు. పోనీలే దిగువస్థాయి మనుషులు కదా ఆప్యాయంగా పలకరిస్తే స్నేహం పేరిట తమలాంటి వారిని ఏదో విధంగా ఉపయోగించుకోవాలని చూస్తారని ఆయన భయం.

ధనుంజయకి అటువంటి అనుభవాలు

ఎక్కువనే చెప్పాలి. ఒకసారి తను గూడూరులో పనిచేస్తున్నప్పుడు ఒకతను "పెద్దయ్యా! పెద్దయ్యా!" అంటూ వెంటపడేవాడు. పోనీలే అని కొంచెం చనువిస్తే తన అవసరాలని, సమస్యల్ని రోజూ ఏకరువు పెట్టేవాడు. ప్రతి చిన్న అవసరానికీ డబ్బు సర్దమని ఇబ్బంది పెట్టేవాడు. ఒకటి రెండుసార్లు సహాయం చేసినా తీసుకున్న సొమ్ము తిరిగి ఇచ్చేవాడు కాదు కదా, కనీసం ఆ మాట కూడా తలపెట్టకుండా మరలా మామూలుగా ప్రవర్తించేవాడు. బయట మటుకు పెద్ద హోదాని ప్రదర్శించేవాడు.

అందుకే బీద అరుపులు అరిచేవాళ్ళని, పాజిటివ్ అప్రోచ్ లేనివాళ్ళని అస్సలు పట్టించుకోవడం మానేశాడు.

కానీ ఆ కుర్రాడిని చూసిన తరువాత తన ఉద్దేశాల్ని కొంచెం సడలించుకోవాలనిపించింది. ఏ క్షణాన వాణ్ణి గుళ్ళో చూశాడో వాడంటే కొంచెం సదభిప్రాయం ఏర్పడింది.

ధనుంజయ శ్రీరామ్ చిట్‌ఫండ్స్‌లో బ్రాంచి మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. ఆయన భార్య పద్మావతి కొడుకు సుదీప్ కూతురు వింధ్య. ట్రాన్స్‌ఫర్‌బుల్ జాబ్ కావడంతో తను మారిన ప్రతి ఊరికీ పిల్లల్ని మారిస్తే వాళ్ళ చదువులు దెబ్బతింటాయని భార్యని, పిల్లల్ని హైదరాబాద్‌లో వుంచి తను మాత్రం వీక్ ఎండ్స్‌లో వెళ్ళి వస్తూంటాడు. ఇంకా ఎలిమెంటరీ స్కూల్‌లో స్టడీస్‌లోనే ఉన్నారు కదా ఇప్పటి నుంచీ వాళ్ళ చదువుకోసం ఎందుకింత ఆరాటం అని ఆయనకు ఎప్పుడైనా అనిపించినా భార్య ససేమిరా అనేది.

"మీరు రెండు సంవత్సరాలకొక ఊరు మారుతూ వుంటే వాళ్ళకి చదువు ఏమి అబ్బుతుంది. నేను అప్పట్లో పెద్దగా చదువుకోలేక పోయాను. కనీసం నా పిల్లలైనా మంచిగా చదువుకుని ప్రయోజకులు కాకపోతే ఎలా? ఆ పడే ఇబ్బందేదో మీరే పడండి. నెమ్మదిగా ఇక్కడికి బదిలీకి ప్రయత్నం చేసుకొని వచ్చేయండి. అయినా మీరు పనిచేస్తున్న ఆ చిన్న ఊళ్ళో మంచి కాన్వెంట్లు ఏమీ వుండవు".

భార్య మాటలు నిజమనిపించి ఆమె చెప్పినట్లే చేశాడు. బేగంపేట శాంతిబాగ్ అపార్ట్‌మెంట్స్‌లో ఫ్లాట్ తీసుకొని కూతురు వింధ్య, కొడుకు సుదీప్‌లను నీరజ్ పబ్లిక్ స్కూల్‌లో జాయిన్ చేశాడు. స్వతహాగా దైవభక్తి పరాయణుడైన ధనుంజయ సాయంత్రం ఆఫీసు నుండి వచ్చిన తరువాత తను ఉంటున్న ఇంటికి దగ్గరలోని ఓంకార క్షేత్రంలో దైవసన్నిధిలో కొంచెంసేపు గడిపి వచ్చేవాడు.

ఎందరో భక్తులు వచ్చిపోతున్నా ఎవరితోనూ ఎక్కువగా కలిసే తత్వంకాని ధనుంజయ పెద్దగా ఏమీ పట్టించుకొనేవాడు కాదు. కానీ ఆ కుర్రాడు మండపం శుభ్రంగా లేకపోతే చీపురు పట్టుకొని ఊడ్చేవాడు. అందరికన్నా ముందువచ్చి చాపలు పరిచేవాడు. పూజారి ఏవైనా చిన్నచిన్న పనులు చెబితే చేసి పెట్టేవాడు. ప్రసాదాల కోసం అందరికీ ఆకులు పంచేవాడు. అందరి పిల్లల్లా కాకుండా భక్తులు ఏవైనా స్తోత్రాలు పారాయణం చేస్తుంటే కళ్ళు మూసుకుని వింటూ కూర్చునేవాడు. ముఖానికి విభూది రాసుకుని నుదుటిపై బొట్టు పెట్టుకొని ప్రశాంతంగా కూర్చునేవాడు. మొదట్లో పట్టించుకోలేదుగానీ తరువాత గమనించసాగాడు ధనుంజయ.

అతి వినయం ధూర్త లక్షణం అని సాదాగా ఉంటూనే కొంతమంది మనుషులు చేతి వాటానికి పాల్పడతారని అతని ఉద్దేశ్యం. చేతికందినవి ఎత్తుకుపోవడం, పగలు చూసి రాత్రికి దొంగతనానికి రావడం అనేవి ఈ రోజుల్లో ఎన్ని చూడడంలేదు! అందుకే ఎవరినీ ఎప్పుడూ ఏ విషయంలోనూ పూర్తిగా నమ్మని ధనుంజయ ఆ కుర్రాడిమీద కూడా అదే అభిప్రాయాన్ని ఏర్పర్చుకున్నాడు. కానీ ఒక్కోసారి ఎవరూ పట్టనట్లు పురాణ బండ మీద కూర్చుని ఏకాంతంగా ఏదో ఆలోచిస్తూ ఉంటాడు.

రోజూ ఉదయాన్నే ఎనిమిదన్నర గంటలకు ఆఫీసుకు బయలుదేరే ధనుంజయ సరిగ్గా కాలేజీ సెంటర్‌కి వచ్చేసరికి వాడు తన కోసమే ఎదురుచూస్తూ కనిపించేవాడు. మొదట్లో ఒకటి రెండుసార్లు పోనీలే అని తన స్కూటర్‌మీద లిఫ్ట్ ఇచ్చి ధనుంజయకు రోజూ దర్శనమిస్తూండ టంతో చివరికి అరికాలు మంట నెత్తికెక్కింది. ఇక అతన్ని పట్టించుకోకుండా వెళ్ళిపోయాడు.

"ఏరా! ముఖం అంతా అలా వాచిపోయిందేమిటి? ఎక్కడైనా పడిపోయావా?"

"లేదండీ ఉదయాన్నే షెడ్‌కి నడిచి వెళ్ళేసరికి లేటు అయిపోయింది. ఆలస్యమైందని మా ఓనరు నా మీద అరిచి, ముందూ వెనకా చూడకుండా చావగొట్టి వదిలాడు" ఏడుస్తూ చెప్పేసరికి ఒకింత జాలి కలిగింది.

"పోనీ బస్సుమీద వెళ్ళి రాకపోయావా?"

"మీరు పిలిచినా పలక్కుండా వెళ్ళిపోయారు. మరొకరిద్దర్ని అడిగి చూశా. వాళ్ళు నా మాట విన్పించుకోలేదు. బస్సుకు డబ్బులు లేక కాలినడకన వెళ్ళేసరికి అరగంట ఆలస్యమయింది".

"మరి మీ ఓనరు నీకు జీతం ఇస్తాడు కదా!"

"ఇస్తాడండి! ఇచ్చే నాలుగు వందలూ తెచ్చి మా అయ్యకు ఇవ్వకపోతే ఆయన చావకొడతాడు" వచ్చీరాని వెక్కిళ్ళమధ్య చెప్తుంటే నిజంగా బాధ అన్పించింది ధనుంజయకు.



"ఒరేయ్ జయా! కాస్త ఈ మావిడాకులు గుమ్మానికి కట్టిపెడతావూ!" ఆచారిగారి కేక విని కళ్ళని చొక్కాతో తుడుచుకొని అటువైపుకు పరుగుతీశాడు.

ధనుంజయ మనసు ఆర్ద్రతతో నిండిపోయింది.

బలహీనవర్గాలు కూటికి మొహం వాచిన అభాగ్యులు, సమాజంలో వివిధ కారణాల వల్ల నిరాదరణకు గురవుతోన్న నిర్భాగ్యులు, అవిద్య పేదరికాలతో జీవితం ఒక శాపమయంగా బ్రతుకీడుస్తోన్న బడుకు వర్గాల ప్రజలు ఎందరెందరో. దేశం ఎంతో ముందుకు సాగిపోతోందని చంకలు కొట్టుకుంటూ ఇటువంటి వారిని అక్కడే వదిలేసి పాలకవర్గాలు ముందుకు పరుగులు తీస్తున్నాయి. ఆర్థిక వ్యత్యాసాలు, సామాజిక అసమానతలు, బంధుప్రీతి, ఆశ్రిత పక్షపాతాలు అనే రుగ్మతలు మానవుణ్ణి ఆనాటి నుండి ఈనాటి దాకా పట్టి పీడించి సమాజాన్ని అతలాకుతలం చేస్తూనే ఉన్నాయి. ప్రశాంతంగా కూర్చుందామనుకొన్న ధనుంజయకు ఆ క్షేత్రంలో ఆ కుర్రాడు పదేపదే గుర్తుకు వస్తూనే ఉన్నాడు.

"ఒరే అబ్బాయ్! ఈ యాభై రూపాయలు తీసుకుని బస్సు పాస్ కొనుక్కో!" తాడుకు మావిడాకులు గుచ్చుతున్న వాడు ఆయనకేసి వింతగా చూశాడు.

"పర్వాలేదు తీసుకో".

"చూడు జయరాం. పెద్దవాణ్ణి ఇస్తున్నాను, పర్వాలేదు మొహమాటపడక యీ యాభై రూపాయలు వుంచు".

"లేదండి. ఎవరి దగ్గరా అలా ఊరికే సొమ్ములు తీసుకోకూడదని మా అమ్మ చెప్పేది".

"నువ్వేమీ దొంగతనంగా తీసుకోలేదుగా" ఒకింత అసహనంగా అన్నాడు.

"క్షమించండి, ఇంకో పావుగంట ముందు బయలుదేరితే అక్కడికి చేరుకోవచ్చు. ఆ మాత్రం దానికి యాభై రూపాయలు ఎందుకు చెప్పండి" రామాలయం ముఖ ద్వారానికి మామిడి తోరణం కట్టి, బల్ల ప్రసన్నాంజనేయస్వామి ఆలయానికి మారుస్తూ అన్నాడు.

"ఒరేయ్ జయా! బాబుగారు పెద్ద మనసుతో ఇస్తుంటే కాదంటావేంటిరా. అదే మరొకడయితే మారు మాట్లాడకుండా జేబులో పెట్టుకుంటాడు." నక్షత్రమాలకు సిద్ధం చేస్తూ అన్నాడు గుడి అర్చకుడు.

"చెప్పిన మాట విని తీసుకో" బలవంతాన చేతిలో పెట్టాడు ధనుంజయ.

"వాడంతేనండి ఏమిచ్చినా తీసుకోడు. చెప్పిన పనల్లా చేస్తున్నాడని ఒకసారి జాలిపడి ఎవరో భక్తుడు నాకిచ్చిన ఐదు రూపాయలు యివ్వబోయాను. ఆ డబ్బు నేను తీసుకోనని మొరాయించడం సరికదా బలవంతాన చేతిలో పెడితే హుండీలో పడేసి తుర్రుమన్నాడు. జయరాం కూటికి పేద, కులానికి పేద. కానీ, గుణానికి, గొప్పతనానికి పేద కాదు బాబూ" ఆకాశ దీపాన్ని వెలిగిస్తూ అంటుంటే....

"ఒరేయ్ కొంపదీసి ఇప్పుడు మరలా ఆ పని మాత్రం చెయ్యకు" మొహం చిట్లించి అన్నాడు ధనుంజయ.

"క్షమించండి. నాకు అవసరం వచ్చినప్పుడు మీ లిఫ్ట్ తప్పనిసరిగా తీసుకుంటాను" ఒకటి రెండు సార్లు తిరిగి ఇవ్వబోయి ధనుంజయ ఒప్పుకోకపోయేసరికి ఆ యాభై నోటు హుండీలో పడవేసి చల్లగా అక్కడి నుండి జారుకున్నాడు. చూసిన ధనుంజయ అవాక్కయిపోయాడు.

* * *

"అయ్యగారూ!"

ఎవరోనని ధనుంజయ ఇంటి తలుపు తీసేసరికి ఎదురుగా జయరాం కేరియర్‌తో నిలబడి వున్నాడు.

"ఏమిటి? ఈ సమయంలో వచ్చావ్?" కొంచెం చిరాగ్గా అన్నాడు.

"మీరు రోజూ శేఖర్ మెస్‌లో మీల్స్ చేస్తుంటే చూస్తున్నాను. అక్కడ టేస్ట్ అంత బాగుండదు. ఇక్కడే పూర్ణిమ మెస్ ఉంది. చాలా బాగుంటుంది. మీ కోసమని స్పెషల్‌గా కేరియర్ తెచ్చాను.

నిజానికి అతని ధోరణికి కోపంతో ఇంటికొచ్చిన ధనుంజయకి అలా మగత నిద్ర పట్టడంతో డిన్నర్‌కి వెళ్ళలేకపోయాడు. తెరచి చూసేసరికి గుత్తి వంకాయ కూర, పప్పు, బెండకాయ వేపుడు, ఆమ్లెట్, సాంబార్, గడ్డ పెరుగు, చక్రకేళి అరటిపండు. ఆ రోజు తృప్తిగా భోజనం చేశాను.

"అయ్యగారూ! అమ్మగారు వాళ్ళు ఎక్కడ ఉంటారండి?"

చెప్పాడు.


"నేను రోజూ సాయంత్రం కేరియర్ తెచ్చి పెడతాలెండి. మీరు పనికట్టుకొని రోజూ మెస్‌కి వెళ్ళనవసరం లేదు".

"ఒరేయ్ జయా! రోజూ ఇలా టైం వేస్టు చేసుకోకపోతే హాయిగా చదువుకోవచ్చు కదా!"

"అవును బాబూ! గుళ్ళోకి వచ్చి కూర్చుంటే మీ లాంటి చదువుకున్న పెద్దపెద్ద మారాజులంతా వస్తుంటారు. నేను చదువుకు మొహం వాచిపోయినా మీ అందర్నీ చూస్తుంటే ఆ జ్ఞానం నాకు కొంచెం అబ్బుతుందని ఆశ!"

జయరాం మాటలకి సిగ్గుతో తల దించుకోవలసి వచ్చింది ధనుంజయకు.

"ఈ కుర్రాణ్ణి అనవసరంగా అపార్థం చేసుకున్నాను. ధనహీనులంతా దిగజారిపోయి దైన్య జీవితాన్ని గడుపుతారనుకున్నాను. కాని దానికి వీడు మినహాయింపు. ఆచారిగారు చెప్పింది నిజం. వీడు కూటికి పేద, కులానికి పేద.



కానీ సుఖానికీ, గొప్పదనానికి కాదు" ఆలోచిస్తూ తింటున్న ధనుంజయకు జయరాం మీద మొదటిసారిగా పూర్తి సదభిప్రాయం కలిగింది.

మర్నాడు ఆఫీసుకు వెళుతున్న దనుంజయ స్కూటర్, అక్కడ తనకు తెలియకుండానే స్లో అయిపోయింది. ఆ కళ్ళు ఆ కుర్రాడి కోసం వెదికాయి.

"సార్! నమస్తే!"

"లిఫ్ట్ ఇస్తాను రావోయ్!"

నెమ్మదిగా అనుసరించ్చాడు.

"ఏమిటీ రోజూ మాసిన బట్టలు, చెదిరిన జుట్టుతో వుండేవాడివి ఈ రోజు కొత్తగా కనబడుతున్నావ్?"

"మీ లాంటి పెద్దల ముందు నించోవాలంటే నాకున్నంతలో నీట్గా ఉండాలి కదండీ!" ఆ క్షణంలో జయరాం ఎంతో అపురూపంగా అనిపించి ఆయన నోట మాటలు కరువయ్యాయి.

సాయంత్రం ఆఫీసు నుండి బయటికి వచ్చి చూసేసరికి దుమ్ము కొట్టుకొనిపోయిన తన స్కూటర్ వాటరింగ్, లూబ్రికేషన్ చేయబడి తళతళా మెరుస్తూ వుంది. చూస్తే ప్లగ్, బ్రేక్స్, క్లచ్, యాక్సిలేటర్స్ సర్వీసింగ్ చేయబడి ఉన్నాయి. ఆశ్చర్యపోవడం ధనుంజయ వంతు అయింది. వాచ్మెన్ని అడిగితే ఎవరో షెడ్లో పనిచేసే కుర్రాడు మీరు చెప్పారని చెప్పి స్కూటర్ తీసుకువెళ్ళి మరలా తెచ్చి పార్క్ చేశాడని చెప్పడంతో విషయం అర్థమైంది.

రోజూ ఆఫీసుకు బ్రేక్ఫాస్ట్, లంచ్బాక్స్లు తీసుకొచ్చి అందివ్వడం, సాయంత్రం డిన్నర్ తెచ్చివ్వడం వంటి పనులకి జయరాంమీద ఆధారపడసాగాడు. ముఖానికి చక్కగా విబూధి రేఖలు, బొట్టు పెట్టుకొనే ఆ కుర్రాణ్ణి చూస్తుంటే ధనుంజయకు ముచ్చట గొలిపేది. క్రమంగా రోజూ లిఫ్ట్ ఇవ్వడం అతని దిన చర్యలో ఒక భాగమైపోయింది.

"మా శ్రీరామ్ చిట్ఫండ్స్ ఆఫీసులో మంత్లీ కలెక్షన్లకి మెంబర్స్ని కొత్తగా తీసుకొంటున్నాము. చిన్నవాడివైనా చేయగలనంటే చెప్పు, నీకు ఉద్యోగం ఇప్పిస్తా. అది చేసుకుంటూ పార్ట్ టైం చదువుకోవచ్చు. ఇప్పటికన్నా జీతం నెలనెలా ఎక్కువే వస్తుంది" అయ్యగారు అన్న మాటలకి జయరాం కళ్ళు ఆనందంతో మెరిశాయి.

ధనుంజయ ప్రోద్బలంతో ఆ ఉద్యోగంలో చేరిపోయాడు.

ఆఫీసులో అందరికీ సహాయం చేస్తూ తలలో నాలుకలా ఉండడంతో అందరూ "మంచి చలాకీ అయిన కుర్రాడు" అని మెచ్చుకోసాగారు.

నెమ్మదిగా కంప్యూటర్లో డాటా ఎంటర్ చేయడం వంటివి నేర్చుకోవడం మొదలుపెట్టాడు. చేదోడుగా వుండే జయరాంని అందరూ చదువుకోమని ప్రోత్సహించేవారు.

శ్రద్ధగా చదివిన అతను టెన్త్ క్లాస్ ఫస్ట్ క్లాస్లో పాసయ్యాడు. పట్టుదలతో సాధించిన వాడి మార్కులని చూసి ధనుంజయతో సహా అందరూ ముక్కున వేలేసుకున్నారు.

"ఇన్ని మంచి మార్కులు సాధిస్తావని నేను అనుకోలేదు. నిన్ను చూస్తే నాకు చాలా సంతోషంగా వుంది. నీ చదువు ప్రస్థానం ఇక్కడితో ఆగిపోకూడదు. ఇంకా పై చదువులు చదవాలి. మీ నాన్న వైపు నుండి ఏ సమస్యలు లేకుండా నేను చూస్తాను. కష్టపడి చదువుకొని పైకి రా! ఇక్కడ ఆంధ్రాబ్యాంక్ మేనేజర్ నాకు బాగా తెలుసు. నీకు కావాల్సివచ్చినపుడు 'ఎడ్యుకేషన్ లోన్ ఇప్పించే ఏర్పాటు చేస్తాను" కళ్ళు ఆనంద భాష్పాలని వర్షిస్తూంటే తన గాడ్ఫాదర్ ధనుంజయ వైపు అనునయంగా చూశాడు.

"సార్! మీరు చేసిన ఈ మేలుకు కృతజ్ఞతలు చెప్పడానికి మాటలు రావడంలేదు. మీతో నా పరిచయం ఈ జీవితాన్ని మలుపు తిప్పి చక్కని దిశను నిర్దేశిస్తోంది. మీకు ఆజన్మాంతం ఋణపడి ఉంటాను".


చేతులు పట్టుకొని ఆరాధనగా మాట్లాడుతూ వుంటే "మిస్టర్ చేయవలసింది ముందు చాలా ఉంది. మాటలు తరువాత. అనుకున్న గోల్ని సాధిస్తే అప్పుడు ఈ సెంటిమెంట్స్ అన్నీను".

కాలక్రమంలో ధనుంజయకు కొత్తగూడెం బ్రాంచికి ట్రాన్స్ఫర్ అయింది. తనకు చేతనైన సహాయం అందించిన ఆయన ఆ ఊరికి మారక తప్పలేదు. చాలా సంవత్సరాలు లెటర్స్ ద్వారా తగిన సూచనల్ని, సలహాలని అందించి జయరాం ఎకడమిక్ కెరీర్కు చాలా వరకు సహాయపడ్డాడు.

* * *

'మీరిలా మీనమేషాలు లెక్కిస్తూ కూర్చుంటే ఇంట్లో అందరం హుస్సేన్ సాగర్లోకి దూకి చావాలి' పప్పు అన్నంలోకి నెయ్యి వేస్తూ అంటూన్న భార్యకేసి చికాకుగా చూశాడు ధనుంజయ.

"నువ్వు నోరు మూస్తావా లేదా? వెధవ సంత



ఇంట్లో తృప్తిగా పిండాకూడు తినేందుకు కూడా నోచుకోలేదు" టమోటా పప్పు కలుపుకుంటూ అన్నాడు.

"అవును. చేతులు కాలాక తీరిగ్గా కూర్చుని స్పూన్తో తిందురుగాని" వడ్డించిన గిన్నెని చివాలున కింద పడేసి చేయి తుడుచుకుంటూ వంటింట్లోకి నడిచింది పద్మావతి.

"నా కూతురు అటువంటిది కాదు, బంగారం. నా పేరు నిలబెడుతుందేగాని మచ్చ తెచ్చే పని ఎన్నటికీ చేయదు".

"అవును అలా అనుకుంటూ కూర్చోండి. ఎప్పుడో ఎవణ్ణో ఒకణ్ణి తెచ్చి 'దీవించు నాన్నా' అంటుంది" అన్నం వడ్డిస్తూ అంది.

## పెరఫార్మెన్స్ ముఖ్యం

ప్రేమ కర్నాటకకు చెందిన భామ అయినా తెలుగు ప్రేక్షకులకు బాగా సుపరిచితురాలు. ఆమె చాలా తెలుగు సినిమాల్లో నటించింది. అయితే ప్రేమ కేవలం పెరఫార్మెన్స్ ఉన్న పాత్రలనే పోషిస్తోంది. ఇందుకు కారణం ఏమిటి అంటే, ఓ చిరునవ్వు నవ్వి 'నాకు ఎలాంటి రోల్స్ సూట్ అవుతాయో అలాంటివి మాత్రమే చేస్తాను' అని సమాధానం చెప్పింది. సౌందర్య, రేవతి, సుహాసిని వీళ్ళంతా పెరఫార్మెన్స్తో పైకి వచ్చిన వాళ్ళే కానీ గ్లామర్తో కాదన్నది ప్రేమ వాదన. సిమ్రాన్ కూడా గ్లామర్ కారణంగా కాదు, పెరఫార్మెన్స్తోనే అని బల్లగుద్ది మరీ వాదించింది ప్రేమ.

"అబ్బా పద్మా ఊరుకోవే. విషయం పూర్తిగా తెల్సుకోకుండా ఏదో నోటికొచ్చింది వాగితే ఎలా?"

"లేకపోతే ఏమిటి? ఒంటిమీదకి పాతికేళ్ళు వచ్చాయి. పెళ్ళి చేసుకోవాలంటే దానికి పట్టదు. సంబంధాలు వెదకడానికి మీకు పట్టదు. మధ్యలో నలిగి చచ్చేది నేను" మొగుడు తిన్న కంచాన్ని తీస్తూ అనేసరికి...

"పద్మా! వింధ్యను తక్కువగా అంచనా వేస్తున్నావ్. అది నా కూతురు" చేతులు కడుక్కుంటూ అన్నాడు.

"అందుకే నా బాధ. దాని ఈడు పిల్లలు ఇద్దరేసి పిల్లల్ని కని చక్కగా కాపురాలు చేసుకుంటున్నారు. మీరేమో ఏవో దిక్కుమాలిన చదువులన్నారు. ఎమ్.సి.ఏ. అన్నారు, కంప్యూటర్ కోర్సులంటూ మొత్తానికి దాన్ని పీకలదాకా ముంచారు. ఉద్యోగంలో చేరి మూడు సంవత్సరాలేగా అయింది. అప్పుడే నాకు పెళ్ళి ఏమిటి అని మొరాయిస్తుంది".

"నా పెళ్ళికి నాకు లేని బాధ నీకెందుకమ్మా! నేను చేసుకుంటానన్నానా. కానీ ఇప్పుడు కాదు. టైము రావాలి. కాలం కలిసి వచ్చినప్పుడు చేసుకునేవాడు వెతుక్కుంటూ వాడే వస్తాడు. ఇక మీరు నిశ్చింతగా ఉండొచ్చు".

ఆఫీసు నుండి ఎప్పుడు వచ్చిందో బ్యాగ్‌ను అసహనంగా మంచంమీద పడేసి అంది వింధ్య.

"ఏరా విందూ! మీ అమ్మ పిచ్చిది అలాగే అంటుంది గానీ, ఈ రోజు మీ ఆఫీసు విశేషాలు ఏమిటి చెప్పు?"

"మా సత్యం కంప్యూటర్స్ చెన్నయ్ యూనిట్‌ని ఎక్స్‌పాండ్ చేయడానికి టాప్ మేనేజ్‌మెంట్ డెసిషన్ తీసుకుంది".

"అయితే హైదరాబాద్ నుండి కొంతమందికి ట్రాన్స్‌ఫర్ తప్పవన్న మాట".

"నువ్వు ఒప్పుకుంటే నేను కూడా చెన్నయ్‌కి ట్రాన్స్‌ఫర్ కోసం అప్లయి చేద్దామనుకుంటున్నా" టవల్‌తో ముఖం తుడుచుకుంటూ అంది.

"అది ఒక్కటే తక్కువ. ఉన్న ఊర్లోనే బయటకు వెళ్ళిన నువ్వు ఇంటికి వచ్చేదాకా ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ఉంటున్నాము. అటువంటిది మరో ఊరు వెళ్ళడమా? తల్లీ నీకు ఆ మూడు ముళ్ళూ పడితే నువ్వూ నీ మొగుడూ చెన్నయ్ వెళ్ళినా, చిదంబరం వెళ్ళినా ఇక మీ ఇష్టం".

"అబ్బా పద్మా! నువ్వు ఊరుకుంటావా లేదా!

## కైకూలు

## (ప్రేమ పర్వం)

రెప్ప తలుపు
గడియ వేస్తేనే
స్వప్నానికి పానుపు

ఎదమెత్తని
వత్తిళ్ళే
కౌగిళ్లకు కైసేతలు

కుదురు చూపు
ఒదుగునా
కదురు తిరుగు కళ్లలో

ఉదయరాగ
కలశమా
పిదికావా వలపాలు

ఓరచూపు
తీగమీద
ఆరేసిన గుండెనాడి

వాలుజడకు
అల్లింది
వలవంతుల చేమంతులు

- సాంధ్యశ్రీ

చూడమ్మా విందూ మీ అమ్మ పూర్వకాలం మనిషి. ఏదో వాగుతోందని మనం అనుకోవచ్చుగానీ, దాని మాటల్లో ఎంతో రియాలిటీ ఉంది. నేనా రిటైర్‌మెంట్‌కి వచ్చేశాను. అన్నయ్య ఒకింటివాడై ఢిల్లీ వెళ్ళిపోయాడు. నీ బాధ్యత కూడా మాకు తీరిపోతే..."

"డాడీ! నా గురించి నాకన్నా మీకే ఎక్కువ తెలుసు. ఏమంటారు?"

"అందుకే కదరా! ఆ కార్యాన్ని కూడా గట్టెక్కించేద్దామని"

"నేను ఆ విషయం గురించే ఆలోచిస్తూ మదన పడుతున్నాను" ఆ మాటలు విన్న ఆయన హృదయంపై పన్నీటి జల్లు కురిసినట్లు ఫీలయ్యాడు.

"నన్ను కన్నారు, పెంచి పెద్దచేశారు. ఎమ్.సి.ఏ. చదివించి మంచి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌ని చేశారు. మీ అభ్యుదయ భావాలు, మంచితనం, నిరాడంబరత, నిజాయితీలు నాకు తెలియంది కాదు".

ఒక్కసారి కూతురివైపు ఆపేక్షగా చూశాడు.

"అలాంటి ఉన్నత సంస్కారం కలిగిన మీరు నా తండ్రి కావడం నిజంగా నా అదృష్టంగా భావిస్తాను".

సింక్‌లో గిన్నెలు కడుగుతున్న పద్మావతి కూతురు కొత్తగా మాట్లాడటాన్ని వింతగా ఆలకిస్తోంది.

"అది సరే! పెళ్ళి సంగతి మాట్లాడవే" కొంచెం నిష్ఠూరంగా అంది పద్మావతి.

"తప్పక చేసుకుంటా... మీ పేరు నిలబెడతానేగాని మీరు తల వంచుకునేలా ఎన్నటికీ చేయను".

"అద్సరేరా! తణుకులో సుకుమార్ అని నా చిన్ననాటి మిత్రుడు. ఇందాక మళ్ళీ ఫోన్ చేశాడు. ఆ రోజుల్లో వాడూ నేను ఎంతో ఫ్రెండ్లీగా ఉండేవాళ్ళం. వాడి కొడుకు స్టేట్స్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా పనిచేస్తున్నాడు. 'ఒరే ధనూ! నువ్వు మా చెల్లెలు పద్మ ఒప్పుకుంటే మా వినోద్‌కి మీ వింధ్యను చేసుకోవాలనుకుంటున్నాను. ఈ విధంగానైనా మనం మరలా ఒకటవ్వాలని నా ఆశ' అంటూ చాలా అభిమానంగా మాట్లాడతాడు".

"అది అలాగే నానుస్తుందిగానీ, మీరు ఒక్కసారి మంచి రోజు చూసుకుని తణుకు వెళ్ళి రండి" బట్టలు మడతపెడ్తూ అంటున్న తల్లిని ఉద్దేశించి

"మమ్మీ! నేను నిజంగా మీకు అంత భారమైపోయానా చెప్పండి. నా ఇష్టాయిష్టాలతో సంబంధం లేదనుకుంటే మీ యిష్టం ఇక".

"అది కాదే..."

"నాకింకేమీ చెప్పకండి... మీ కూతురు మీ ఇష్టం. నా మనసుతో మీకు పనేముంది? చెప్పండి" వేదన నిండిన స్వరంతో చదువుతున్న ప్రియదత్త పత్రికను తీసుకొని ప్రక్కగదిలోకి వెళ్లిపోయింది.

నెమ్మదిగా నడుచుకుంటూ వెళ్ళి అక్కడ మంచంపై వాలిపోయిన కూతురు ముఖంమీద అనునయంగా చేయి వేశాడు.

నీళ్ళు కమ్మిన ఆ కళ్ళల్లోకి కాకుండా మసకబారిన ఆమె మనసులోకి తొంగిచూశాడు.

"విందూ! నీ హృదయంలో నెలకొన్న వలపు వీచిక రూపాన్ని గ్రహించే ప్రయత్నం చేయవచ్చా!"

ఎర్రబడ్డ ఆమె కళ్ళలోని భావం మెరుపులా మెరిసి మనసు రాగరంజితమై పోయింది.

గుండెను కూడదీసుకుని గద్గద స్వరంతో చెప్పింది.

"చెన్నయ్‌కి జయరాం ట్రాన్స్‌ఫరై వెళ్ళిపోతున్నాడు. అతన్ని అనుసరించమని మనసు మారాం చేస్తోంది. అతన్ని చూడకుండా వుండలేని ఈ తనువు నిలవనంటోంది".

"అక్కడ ఎన్నాళ్ళుందామనుకుంటున్నావు?"

"అతను తిరిగి హైదరాబాద్ వచ్చేదాకా!"

"నాకు తెలుసండీ. ఇటువంటి కాని పనేదో చేస్తుందని. ముందే చెప్పాను. చదువూ వద్దు, చట్టుబండలూ వొద్దు. పెళ్ళిచేసి పడేయమని ఇప్పుడనుకొని ఏం లాభం దేవుడో!" అంటూ బిగ్గరగా రోదించసాగింది పద్మావతి.

"అమ్మా! నన్ను అర్థం చేసుకోవడానికి ప్రయత్నించు. జయరాం మా ఆఫీసులో నా కొలీగ్. మంచి తెలివైనవాడు. జీవితం అన్నా, తను చేస్తున్న వృత్తి అన్నా మంచి కమిట్‌మెంట్, అవగాహన కలవాడు. అతని డెడికేషన్ ఆఫ్ సర్వీస్‌తో మా యూనిట్ ఎంతో ముందంజ వేయగల్గింది.

అతని హుందాతనం, వ్యక్తిత్వం, పదిమందితో కలుపుగోలుతనం, ఆ స్లిమ్‌నెస్ మొదట్లో నన్ను బాగా ఆకర్షించాయి. అతను మంచి పొజిషన్‌లో ఉన్నా తన గత జీవితాన్ని ఎన్నడూ మరిచేవాడు కాదు. చీరాలలోని తన దుర్భర జీవితాన్ని అప్పుడప్పుడు మననం చేసుకొనేవాడు.

తన జీవితం విజయం వెనక ఉన్న వ్యక్తి స్ఫూర్తిని గురించి భావోద్వేగంతో చెప్పేవాడు. ఆ మంచి మనిషి చేయూత తన జీవిత గమనాన్ని మార్చేసిందనేవాడు. ఎక్కడో మెకానిక్ షెడ్‌లో క్లీనర్‌గా పనిచేస్తున్న తను ఆ మహాత్ముని ప్రోద్బలంతో చదువుకోగలిగానని, ఆయన సమకూర్చిన బ్యాంక్ ఎడ్యుకేష్ లోన్‌తో పై చదువులు చదవగలిగానని ఎంతో ఉన్నతంగా చెప్పుకొనేవాడు.

బడుగు వర్గానికి చెందిన నేను దారిద్ర్యానికి దిగువన నిలబడితే ఊతమిచ్చి నిలబెట్టిన ఆ దేవుని దీవెన తనను ఈనాడు ఈ స్థితికి చేర్చిందని ఎంతో మమకారాన్ని వెలిబుచ్చుతుంటాడు".

వింటున్న ధనుంజయ హృయదం దూదికన్నా తేలిగ్గా ఆహ్లాదభరితంగా అలరారుతోంది.

"తరువాత నెమ్మదిగా చీరాల... శ్రీరామ్ చిట్‌ఫండ్స్... ఆ రోజులు అన్నింటినీ విశ్లేషిస్తే అతనికి సహాయమందించిన ఆ అపురూపమైన వ్యక్తిత్వం నా తండ్రిదేనని తెలిసి ఉప్పొంగిపోయాను.

అప్పటివరకూ అతనిపట్ల నాలో ఏ విధమైన భావాలు లేకపోయినా ఆ క్షణం నుండి అభిమానం కాస్తా ప్రేమగా మారింది. నా తండ్రి వేసిన కాలిదారి కాస్తా దారి అయి రహదారిగా మారి ఈనాడు వందలమందిని శాసించే రాజమార్గంగా రూపాంతరం చెందినదని మురిసిపోయాను.

క్రమంగా నా ప్రొఫెషనల్ యాక్టివిటీస్‌లో మంచి సలహాలనిస్తూ ఎంతో తోడ్పడ్డాడు. చామనచాయ రంగు, బాగా బలంగా, ఎత్తుగా ఓ మాదిరి లావుగా వుండే జయరాం జీన్స్ ప్యాంట్, రోజ్ టీ షర్ట్‌తో ట్రిమ్‌గా షేవ్ చేసి అల్లరిగా గాల్లో ఎగురుతున్న జుట్టుని ఓ చేత్తో సవరించుకుంటూ 'హాయ్ విందూ!' అంటే మనసు ఎటో పోతుంటుంది".


తన బంగారుతల్లి వింధ్యేనా ఇంత చమత్కారంగా మాట్లాడుతోంది అనుకుని నవ్వీ నవ్వనట్లు సన్నగా నవ్వుకున్నాడు.

"డాడీ! స్వార్థం, సంకుచిత భావాలతో ముళ్ళూ రాళ్ళను చేతబట్టుకొని చరిత్ర పుటల్లో ఒదిగిపోతున్న ఈ జనారణ్యంలో అభ్యుదయాన్ని పండించి, మానవతను మేలుకొలిపి, సెక్యులర్ సమానత్వ సూత్రాలను నిలబెట్టడానికి స్వచ్ఛందంగా మీ వంతు కృషిచేసిన ఘనత మీది. అటువంటి మీ కూతురు అని చెప్పుకోవడం గర్వంగా ఫీలవుతుంటాను. మీ రక్తం పంచుకున్న నేను మీ నేపథ్యంలోనే పయనించాలనుకోవడం తప్పు కాదేమో!"

అందుకే ఒకప్పుడు అణగారిన జయరాంలోని ఆశల తీగల్ని చిగురింపజేసి మాధవీలతల్ని పూయించేంతటి లిఫ్ట్ మీరు ఇస్తే... మీ కన్నకూతురుగా అతన్ని నా జీవితంలోనికి ఆహ్వానించి సామాజిక పరంగా లిఫ్ట్ ఇవ్వాలనుకుంటున్నాను. సాంఘికంగా ఆ లతలు మరింత గుబాళించి పరిమళాలు వెదజల్లాలని ఆశిస్తున్నాను".

ఎప్పుడూ తన చదువు ధ్యాసే తప్ప, నాన్నా! నాకిది కావాలని ఏదీ కోరని వింధ్య ధనుంజయకు వింధ్య పర్వతమంత ఉన్నతంగా కనిపిస్తుంది. జయరాంని అభిమానిస్తోందంటే అతను చాలా ఉన్నత భావాలు కలవాడై వుండాలి. ఎప్పుడో పదిహేను సంవత్సరాల క్రితం తాను చేసిన చిన్న మాట సహాయం తన కూతుర్ని అంతగా ప్రభావితం చేసిందన్న అనుభూతి ఆయన్ని ఆనందంతో ఉక్కిరిబిక్కిరి చేస్తోంది.

పెళ్ళి చేసుకో అమ్మా! అని ఎప్పుడు అడిగినా చదువు ఉద్యోగం తప్ప మిగతా విషయాలపై పెద్దగా ఉత్సాహం చూపించని తన గారాల



కూతురు అతన్ని వలచాను నాన్నా! వరిస్తాను అంటుంటే ఆ మాట అతనికి అమృతప్రాయంగా తోస్తోంది.

ఆలోచిస్తోన్న ధనుంజయకు దిండులో తలదూర్చి వెక్కివెక్కి ఏడుస్తోన్న భార్యను చూస్తే జాలి కలిగింది. అమ్మాయి మేడపైకి వెళ్ళింది.

"పద్మా! వింధ్య చేసింది మంచిదా, చెడ్డదా అన్న మీమాంస తరువాత. ముందు పెళ్ళికి ఒప్పుకుంది. కాని ఒక్కటి మాత్రం నిజం. ఆమె ఏ నిర్ణయం తీసుకున్నా చాల ఆలోచించి తీసుకుంటుంది".

"ఎవరో అనామకుడితో, కులంకాని వాడితో దానికి పెళ్ళేమిటండీ! తన్ని ఇంట్లో కూర్చోపెట్టక..."

"తన్నడం అంటే ఎవర్ని తన్నాలి? వింధ్యనా, దాని వ్యక్తిత్వాన్నా? అయినా కావాలని పట్టుబట్టి మీ స్వంత అన్నగారి కూతుర్ని, సుదీప్‌కిచ్చి చేసి మేనకోడల్ని, కోడలుగా తెచ్చుకున్నావుగా, తరువాత ఏమయింది చెప్పు. ఆమెతో మనం ఎన్ని ఇక్కట్లు పడ్డాం, ఎంత క్షోభ అనుభవించాం. చివరికి కన్న కొడుకుని మనకు కాకుండా వేరుచేసి తనతో తీసుకుపోయింది. కనీసం మీ అన్నగారైనా కూతుర్ని వారించి మందలించాడా చెప్పు. ఈ సామాజిక అసమానతలనేవి మనం సృష్టించుకున్నవి. నీకు బాగా అర్థమయ్యేలా చెప్పాలంటే 'వివేకం' అనేది నాకు నచ్చిన కులం. వ్యక్తిత్వం అనేది నేను మెచ్చే మతం.

అయినా ఇప్పుడేం మునిగిపోయింది.? ముందు అబ్బాయిని పిలిచి మాట్లాడితే సరి!"

* * *

"డాడీ! మీట్ మై కొలీగ్ జయరాం.

జయా... వీరు నాన్నా, అమ్మ పద్మావతి".

రాగపూరితమైన ఆరాధనా భావంతో తన అవిటి బ్రతుక్కి ఆలంబన అయిన ధనుంజయగారి వైపు అనునయంగా చూశాడు. ఒక్కసారి హృదయమంతా ఆయనపట్ల భక్తిభావంతో నిండిపోయింది. నోట మాట రావడంలేదు.

ధనుంజయ మౌనంగా అతన్నే గమనిస్తున్నాడు. సందేహం లేదు. కొన్ని సంవత్సరాల క్రితం మోటార్‌షెడ్ జయరాం అతనిలో లీలగా కనిపిస్తున్నాడు.

"జయా! డాడీకి నేనంటే పంచప్రాణాలు. ఎందుకంటే ఆయనకు నాకు పోలికలు ఎక్కువ. ఇద్దరి ఆలోచనా విధానం, ప్రవర్తన... ఇలా ఎన్నో..."

"సార్! ఆనాడు ఒంటరి నిశీధిలో భయకంపితమై నిలబడినప్పుడు ఒక వెలుగు కిరణంలా, ఒక పూల పరిమళంలా, ఒక చల్లని మలయమారుతంలా అనుభూతి నిచ్చిన మీరు నాకు నూతనోత్తేజాన్ని కలిగించారు. వింధ్య నా సహచరి. మీ కూతురన్న విషయం తెలియకుండానే ఆమెలో మీ మంచితనాన్ని చూస్తుండేవాడిని. మీ ఆశీస్సులతో ఎడ్యుకేషన్ లోన్స్, స్కాలర్‌షిప్‌లతో ఎం.సి.ఏ. వరకూ చదవగలిగాను. చాలాసార్లు నా బ్రతుక్కి శోభను చేకూర్చిన ఈ నడిచే దేవుణ్ణి కలవాలని ప్రయత్నించాను. కానీ మీ వివరాలు తెలియరాలేదు. ఇన్నాళ్ళకు మళ్ళీ కలుసుకోవడం చాలా ఆనందంగా వుంది. నా తండ్రి నిరాదరణ నన్ను మానసికంగా ఒంటరిని చేస్తే, వింధ్య స్నేహం బ్రతుకుపై ఆశను పెంచేది.

ఆమెను వలచి మీకు మనస్తాపాన్ని కలిగించినందుకు మన్నించండి. నాకు ఆమెకన్నా మీరు ముఖ్యం. ముకుళిత హస్తాలతో క్షమాపణ కోరుతూ నిర్వేదనగా మాట్లాడుతున్న ఆ కుర్రాణ్ణి చూస్తుంటే పద్మావతిలో మబ్బులను చీల్చుకొచ్చిన అరుణకిరణంలా సదభిప్రాయం తాలూకు వెలుగు తెరలు పొడసూపుతున్నాయి.

తను నిత్యం పారాయణం చేసే మహాభారతంలోని కర్ణ సుయోధనుల సయోధ్య, ఆలోచనాంబరాల్లో లీలగా మెదిలింది. కర్ణుని బుద్ధి కుశలతని, పరాక్రమాన్ని, రాజనీతి, దానగుణాన్ని గుర్తించిన దుర్యోధనుడు, ఆ వీరుని మనుగడకు అతని జన్మ ప్రతిబంధకం కారాదని నిండు కొలువులో సింహాసనాన్నిచ్చి పట్టాభిషిక్తుణ్ణి చేసిన అమృతఘట్టం స్ఫురించిందామెకు.

"బ్రతుకుతెరువు కోసం అతనికి ఆనాడు మీరు లిఫ్ట్ ఇస్తే...

సామాజికంగా నేను లిఫ్ట్ ఇద్దామనుకుంటున్నాను" కూతురి మాటలు అర్థవంతంగా అనిపించాయి.

నిరాదరణతో తమ మనసుల్ని గాయంచేసిన తనది అనుకున్న తన కోడలు గుర్తుకువచ్చి శరీరం ఒక్కసారి కంపించింది.

వింధ్య బాగా ఆలోచించే ఎప్పుడూ నిర్ణయాలు తీసుకుంటుంది.

ఆ మాటతీరు, ప్రవర్తనా విధానం అన్నీ తనకి తెలియకుండానే అతనిపై అభిమాన జల్లుని కురిపించాయి.

"పద్మా! అబ్బాయిని చూశావుగదా... ఇక దాని భవిష్యత్తు నీ అభిప్రాయం మీద ఆధారపడి ఉంది".

"కుర్రాడికే కడిగిన ముత్యంలా ఉన్నాడు" ముసిముసిగా నవ్వుతూన్న వింధ్య, ప్రక్కన అతన్ని చూస్తుంటే ఆ దృశ్యం కడు రమ్యంగా తోచిందామెకు.

"నా వింధ్య ఏది చేసినా బాగా ఆలోచించే చేస్తుంది. చెన్నయ్ ట్రాన్స్‌ఫర్‌కి అప్లయి చేస్తానంటోంది గదా! దాని ఇష్టం, నాకేమీ అభ్యంతరం లేదు" ఆమె మాటల్లో ఎంతో సంతృప్తి, ముఖంలో మరెంతో ఆనందం స్పష్టంగా కనిపిస్తున్నాయి ధనుంజయకు. ❋

